# మోసపోతే గోస పడుతం

- రుద్రూర్, వర్ని మండలాల్లో పోచారం శ్రీనివాసరెడ్డి ప్రచారం
- దళిత ద్రోహి ఏనుగు రవీందర్‌రెడ్డిని తరిమి కొట్టాలి.. బాధితులు


సత్యనారాయణపురంలో ప్రసంగిస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి


సత్యనారాయణపురంలో భారీగా తరలివచ్చిన గ్రామస్తులు


రుద్రూర్‌లో మాట్లాడుతున్న పోచారం

రుద్రూర్/వర్ని, నవంబర్ 22 : ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏనుగు రవీందర్‌రెడ్డి చేసిన అవినీతి అంతా ఇంతా కాదని, అలాంటి నాయకుడిని ఆదరిస్తే మోసపోయి గోస పడుతం అని బీఆర్‌ఎస్ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివారెడ్డి అన్నారు. బొప్పాపూర్ గ్రామంలో పోచారానికి మహిళలు తిలకం దిద్ది మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. తామంతా మీవెంటే ఉంటామని మహిళలు పోచారం శ్రీనివాసరెడ్డికి మాటిచ్చారు. రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్, రుద్రూర్ గ్రామాల్లో పోచారం శ్రీనివాసరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఇప్పటి వరకు బొప్పాపూర్‌లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం రుద్రూర్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన పోచారానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. ఈ పోచారం మాట్లాడుతూ.. నేను లోకల్ ఎప్పటికి మీ అందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. ఇప్పటి వరకు నేను అభివృద్ధి చేశానని నమ్మితేనే మీరు ఓటు వేయండి.. చేసిన అభివృద్ధిలో ఏమైనా పొరపాట్లు ఉన్నా ఇక నుంచి ప్రతి ఒక్కరూ నేరుగా తనవద్దకు వచ్చి అడగవచ్చని అన్నారు. అందరికీ అందుబాటులో ఉండే నాలాంటి నాయకుడు కావాలా? లేదంటే పనులు కావాలంటే ఎల్లారెడ్డి, నిజామాబాద్ వెళ్లి చెప్పే పరిస్థితిలో ఉన్న నాయకుడు కావాలా? అని అన్నారు. ఇప్పటి వరకు రుద్రూర్ మండలంలో సుమారు రూ.37కోట్లతో అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. మీరంతా ఆశీర్వదిస్తే నేను మీ తరపున రెట్టింపు ఉత్సాహంతో మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ముదిరాజ్, మున్నూరు కాపు, వంజరి, దర్జీ సంఘాలు పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా ఏక గ్రీవ తీర్మానాలు అంద జేశారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ నారోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్, వైస్ ఎంపీపీ సాయిలు, పార్టీ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మన్, కార్యదర్శి బాలరాజు, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, సర్పంచ్ బాపూజీ సావిత్రిలింగం, పార్టీ గ్రామ అధ్యక్షుడు తొట్ల గంగారాం, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు ఉన్నారు.

**ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం..**

వర్ని, నవంబర్ 22 : ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రం సత్యనారాయణపురం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాస కాలనీ, వడ్డేపల్లి, సేవాలాల్ తండా, కోటయ్య క్యాంపు ప్రాంతాల్లో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు ఐదు వందల ద్విచక్ర వాహనాలతో ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీనివాస కాలనీలో మహిళలు మంగళహారతులు ఇస్తూ, పూలు చల్లుతూ స్వాగతం పలికారు. వడ్డేపల్లిలో కాలనీ వాసుల కోరిక మేరకు ఆయన హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోట్లాది రూపాయలు వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే.. ఎలాంటి అభివృద్ధి చేయలేదని కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, సీసీ రోడ్లు, ప్రభుత్వ దవాఖానలు, ఇతర అభివృద్ధి పనులు ఏనుగుకు కనబడడం లేదని ఎద్దేవా చేశారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం రవీందర్ రెడ్డి, వర్ని జడ్పీటీసీ సభ్యుడు బర్దావల్ హరిదాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, నాయకులు మేక వీర్రాజు, కల్లాలి గిరి, కో ఆప్షన్ సభ్యుడు కరీం తదితరులు పాల్గొన్నారు.

**పోచారాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలి**

కోటగిరి, నవంబర్ 22 : బీఆర్‌ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కొత్తపల్లి గ్రామ బీఆర్‌ఎస్ శ్రేణులు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న చోటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

**ప్రచారంలో పోచారం చిన్ననాటి స్నేహితుడు**

మోస్రా (చందూర్), నవంబర్ 22 : చందూర్‌కు చెందిన పోచారం శ్రీనివాసరెడ్డి చిన్ననాటి స్నేహితుడు దుర్కి పోశెట్టి పోచారానికి మద్దతుగా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన స్నేహితుడు ఎన్నో మైలు రాళ్లు దాటి ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచాడన్నారు. పోచారం చేసిన అభివృద్ధి పనులు కండ్లకు కనబడుతుంటే ఇప్పటి వరకు ఎక్కడున్నారో తెలియని నాయకులు బాన్సువాడను ఏలు దాం అంటూ వస్తున్నారని, ప్రజలు ఎలా నమ్ముతారని వారికి సరైన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నాను.


చందూర్‌లో ప్రచారం చేస్తున్న పోచారం స్నేహితుడు దుర్కి పోశెట్టి


కొత్తపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఏనుగును ఆదరిస్తే నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టిస్తాడు

**- ఎల్లారెడ్డి నియోజకవర్గ దళితులు**

రుద్రూర్, నవంబర్ 22 : దళితుల భూములను కబ్జా చేసి అడిగినందుకు జైలులో వేసి కొట్టించిన ఏనుగు రవీందర్‌రెడ్డిని ఆదరిస్తే మీరంతా మోసపోతారని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన చిట్యాల సాయన్న, గజాల బాలయ్య, చిట్యాల దుర్గవ్వ అనే దళితులు ఏనుగు రవీందర్‌రెడ్డి అవినీతిని బయటపెట్టారు. మొరం తవ్వకాలు, భూముల కబ్జాలుతో నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టించిన ఏనుగును ఆదరిస్తే రేపు బాన్సువాడ నియోజకవర్గం పరిస్థితి కూడా ఇలాగే అవుతుందని అన్నారు. నియోజకవర్గంలో సరైన పని చేయకనే ఎల్లారెడ్డి నుంచి తరిమేశామని తెలిపారు. ఇక్కడ మీరు ఆదరిస్తే మా నియోజక వర్గానికి పట్టిన గతే ఇక్కడ కూడా పడుతుందని అన్నారు. మా బాధలు చెప్పలేనన్ని ఉన్నాయని, ఇలాంటి నాయకుడు ఎక్కడా పనికి రాడని చెప్పారు. నీ అవినీతిని బయటపెట్టి నీకు ఎక్కడా నిలువకుండా చేస్తామని రవీందర్‌రెడ్డిని హెచ్చరించారు. నీ అవినీతే నీకు శాపంగా మారుతుందని అన్నారు.


రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన వ్యక్తి చిట్యాల సాయిలు

# డబ్బు కోసమే పార్టీ మారారు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లారం సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకులు

వర్ని, నవంబర్ 22 : కాంగ్రెస్ నాయకులు ఇచ్చే డబ్బు కోసం ఆశపడే తమ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారని మల్లారం గ్రామ సర్పంచ్ కన్నీరాం ఆరోపించారు. వర్ని మండలం మల్లారం గ్రామంలో సర్పంచ్ కన్నీరాం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడారు. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తాను నిర్మించుకున్న ఇంటికి డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేసి బిల్లులు ఇప్పించాలని కోరారని అన్నారు. ఆ వ్యక్తి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉండడంతోపాటు పథకానికి అర్హుడు కాకపోవడంతో తాము నిరాకరించామన్న కక్షతో పార్టీలు మారాడని ఆరోపించారు. మరో వ్యక్తికి పోడు భూములు ఇవ్వడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నప్పటికీ కేవలం డబ్బు ఆశతో కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆరోపించారు. గ్రామంలో సుమారు నాలుగు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, తామంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డికే పూర్తి మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాడ లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దిలారి బాబు, ఉప సర్పంచ్ వెంకాగౌడ్, నాయకులు హన్మాగౌడ్, చిన్న సంగ్యా, మాడ చిన్న గంగారాం, మాడ శ్రీనివాస్, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు వద్ద విధులను పకడ్బందీగా నిర్వహించాలి

కోటగిరి, నవంబర్ 22 : ఎన్నికల సందర్భగా విధులు నిర్వహిస్తున్న పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఎన్నికల పరిశీలకురాలు తానియా సింగ్ ఆదేశించారు. బుధవారం పొతంగల్ మండలం మంజీర నది సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో కోటగిరి ఎస్సై సందీప్, ఎస్ఎస్‌టీ బృందం, బీఎస్ఎఫ్, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.


పొతంగల్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎన్నికల పరిశీలకురాలు తానియాసింగ్